క్లుప్తంగా

గిరి ప్రదక్షిణ


కదిరి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కదిరి అర్బన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున భక్తులు కుమ్మవాండ్లపల్లిలోని కదిరి కొండ చుట్టూ ఆదివారం గిరిప్రదక్షిణ చేశారు. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజున భక్తులందరూ గిరిప్రదక్షిణ చేస్తే మంచి జరుగుతుందని పూజారులు తెలిపారు. గిరిప్రదక్షిణ చేసే భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

వైద్య శిబిరం


దాతను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ధర్మవరం రూరల్: ధర్మవరంలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్, ధర్మవరం మిడ్ టౌన్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 175 మందికి పరీక్షలు చేసి 136 మంది శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. అనంతపురం అన్నపూర్ణ రెడీ మిక్స్ కాంక్రీట్ వారి సహకారంతో శిబిరం నిర్వహించినట్లు దాత చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయ సింహ, వైస్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, సభ్యులు శివయ్య, రమేష్‌బాబు, కొండయ్య, ప్రసన్నకుమార్, మనోహర్ గుప్తా, ట్రెజరర్ సుదర్శన్ గుప్తా, కృష్ణమూర్తి, బత్తలపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేయవచ్చని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని చైల్డ్ ఫండ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం చైల్డ్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, యువత ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా పరిసరాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం మొక్కల పెంపకం చేపడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ కోర్డినేటర్లు శివమ్మ, సుమతి, కమ్యూనిటీ మెంబర్లు జహరున్నీషా, శ్రావణి, బీబిజాన్, పవన్‌కుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కాలనీలో పోలీసుల సోదాలు


వడ్డెర కాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీలో మద్యం విక్రయిస్తున్న వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాలనీలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కాలనీ వాసులకు సూచించారు.

విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి

హిందూపురం: మండలంలోని మిట్టమీదపల్లిలో రైతు సురేష్‌కు చెందిన పాడి ఆవు ఆదివారం 11 కేవీ విద్యుత్ వైర్ తగిలి మృతిచెందింది. ఉదయం ఆవు గ్రామ సమీపంలో గడ్డి మేస్తుండగా తెగి కిందపడి ఉన్న కరెంట్ వైరు తాకడంతో అక్కడిక్కడే మృతిచెందింది. ఆవు మృతి చెందటంతో రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఆవు మృతి చెందిందన్నాడు.


మహాలక్ష్మి ఆలయం పక్కన చెత్తాచెదారం


ఆలయ సమీపంలో ఉన్న గుజిరీ సామగ్రి

ఆలయ ప్రాంతం.. దుర్గంధభరితం

- అపరిశుభ్రంగా మరకత మహాలక్ష్మి ఆలయ పరిసరాలు
- ఆలయం ముందు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- స్థానికులకు తప్పని అవస్థలు

కదిరి టౌన్: పట్టణంలోని మరకత మహాలక్ష్మి ఆలయ పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వైశ్యా బ్యాంక్ కాలనీ, దత్త నగర్, ఇందిరాకాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. పట్టణంలోని హోటళ్లు, ఆటోమొబైల్స్, ఇతర దుకాణాల్లోని వ్యర్థాలన్నింటినీ మరకత మహాలక్ష్మి ఆలయ సమీపంలో అనంతపురం హైవేకి ఆనుకుని ఉన్న ప్రాంతంలో వదిలేస్తున్నారు. దీంతో ఆలయ ప్రాంతాలన్నీ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో భక్తులు ఆలయానికి రావాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొందరు ప్రైవేట్ వ్యక్తులు వివిధ భవన నిర్మాణ యంత్రాలను కొన్నేళ్లుగా ఇక్కడే వదిలేశారు. వినియోగంలేని పాత వాహనాలు గుజిరి సామగ్రిని ఉండటడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు..

ఆలయ పరిసరాల్లో కంపచెట్లు ఎక్కువగా ఉండటడంతో సాయంత్రమైతే చాలు అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో మహిళలు గుడికి రావాలంటేనే జంకుతున్నారు. వారం రోజుల క్రితం ఆలయ సమీపంలో దొంగతనం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఆలయ పరిసరాలు అధ్వానంగా ఉన్నా మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆలయ పరిసరాలు శుభ్రం చేయించాలి



ఎంతో పవిత్రమైన మరకత మహాలక్ష్మి ఆలయం చుట్టూ పరిసరాలను శుభ్రం చేయించి ఖాళీ ప్రాంతంలో మొక్కల పెంపకం చేపట్టాలి. అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

–అంజనేయులు సైదాపురం

వాకింగ్ ట్రాక్‌కు వినియోగించాలి



ఆలయం చుట్టూ ఎవరూ వ్యర్థాలు వేయకుండా చూడాలి, ముళ్లపొదలను శుభ్రం చేయించడంతో ఈప్రాంతాన్ని వాకింగ్ ట్రాక్‌గా వినియోగిస్తే బాగుంటుంది. నిరుపయోగమైన యంత్ర సామగ్రిని అక్కడ ఉంచకుండా చూడాలి.

–శ్రీనివాసులు

చర్యలు తీసుకుంటాం

మరకత మహాలక్ష్మి ఆలయం చుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. భవిష్యత్తులో ఎవరూ అక్కడ వ్యర్థాలను వేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం.

–కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ఎస్జీటీలకు మ్యానువల్‌గా కౌన్సెలింగ్ చేపట్టాలి

ఓడీచెరువు: రాష్ట్రంలో ఎస్‌జీ టీచర్లకు మ్యానువల్ పద్ధతిలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్ లాజమ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకట చలమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. గత 15 రోజులుగా మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటికిప్పుడు వెబ్ కౌన్సెలింగ్ అని తెలపడంతో ఉపాధ్యాయులు ఆందోళనలకు గురవుతున్నారని తెలిపారు. లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న వారు వేల సంఖ్యలో ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలంటే అనేక ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యా శాఖాధికారులు గతంలో ఇచ్చిన మాట ప్రకారం మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మాధవరాజుల స్వామి పరుష ప్రారంభం

కనగానపల్లి: మండలంలోని భానుకోట గ్రామంలో ఆదివారం మాధవరాజుల స్వామి పరుష ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పరుషలో తొలిరోజు స్వామిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి కాపులు, భక్తులు గ్రామ సమీపంలోని ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఇక సోమ, మంగళవారాల్లో జరిగే ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు.

అరకొర జ్ఞానంతో ఆరోపణలు చేస్తారా?


మాట్లాడుతున్న సర్పంచ్ సుధారాణి, నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని నాగసముద్రం పంచాయతీ నిధులు పక్కదారి పట్టాయని అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఆరోపించడంలో వాస్తవం లేదని సర్పంచ్ సుధారాణి స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జోలా రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సర్పంచ్ భర్త ఓబులేసుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుధారాణి మాట్లాడుతూ.. తాను అధికారం చేపట్టాక గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఈఓఆర్డీ, ఇంజినీర్లు పరిశీలించిన అనంతరం బిల్లులు చేశారన్నారు. రూ.12 లక్షల వరకు అక్రమాలు జరిగాయని ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. కనీస జ్ఞానం లేకుండా మాట్లాడొద్దని అధికార పార్టీ నాయకులకు హితవు పలికారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించిన వేతనాలను వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన బిల్లులు, ఫొటోలతో పాటు అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి శుక్రవారం తాళం వేయడం సరికాదని తెలిపారు. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. పంచాయతీ పరిధిలో సర్పంచ్, కార్యదర్శి అనుమతి లేకుండా పని చేసి దానికి బిల్లు చేయాలని కార్యదర్శిపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అలాగే నాగసముద్రం చెరువు కట్టకింద పంచాయతీ నిధులతో బెంచీలను ఏర్పాటు చేయగా వాటికి సంబంధించి బిల్లులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటివి మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు చెన్నారెడ్డి, రామాంజనేయులు, జయరెడ్డి, చెన్నారెడ్డి నాయకులు ఎస్డీడీ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం


కరపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ధర్మవరం రూరల్: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ విక్రాంత్, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌బాబులు కోరారు. ఆదివారం స్థానిక జేజే నగర్‌లోని శ్రీ సత్య చిన్న పిల్లల హాస్పిటల్ వద్ద జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరిచే శక్తులు వ్యవస్థలో ఉన్నాయన్నారు. ఇలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జన విజ్ఞాన వేదిక చేస్తోందన్నారు. అనేక రంగాల్లో మునుపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో శాస్త్ర విజ్ఞానం దూసుకుపోతున్నా మధ్య యుగాల ఛాదస భావాలు ప్రజానీకాన్ని విజ్ఞాన ఫలాలను అందుకోనియకుండా చేస్తున్నాయన్నారు. ఒక ఉన్నతమైన శాస్త్రీయ సమాజం కోసం ప్రజా సైన్సు ఉద్యమానికి తోడ్పాటు అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు. జేవీవీ నాయకులు సురేష్, నరేంద్రబాబు, నాగేంద్ర, ఖలందర్, మల్లికార్జున, మనోహర్, జంగమన్న, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని కొండవెనుకపల్లి క్రాస్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. డీ. చెక్కవారిపల్లికి చెందిన రామాంజులు, నాగరాజు బైక్‌పై బయలుదేరారు. అయితే క్రాస్ దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రామాంజులు, నాగరాజుతో పాటు గొల్లపల్లికి చెందిన ఆంజనేయులుకు తీవ్రంగా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అనంతరం వైద్యుల సూచన మేరకు వారిని కదిరి ఆసుపత్రికి తరలించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గతంలో ఉన్న ఆలయాన్ని తొలగించి ఇటీవల నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. పాత ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహానికి పునః ప్రాణ ప్రతిష్టాపన చేసి, నూతనంగా నిర్మించిన గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, దర్మదర్శి రామకృష్ణారెడ్డి, కట్టిమనే గౌడలు, గొంచికార్ భక్తులు పాల్గొన్నారు.

సత్యమ్మ దేవతకు బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ముదిగుబ్బ: సిరిగారిపల్లి గ్రామంలో ఆదివారం సత్యమ్మ దేవతకు బోనాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే మహిళలు బోనాలు తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని వారు అమ్మవారిని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


అశ్వర్థనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


కదిరిలో వధూవరులను ఆశీర్వదిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: అధైర్యపడొద్దు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి బాధితులకు భరోసా కల్పించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చిన్నబోయనపల్లికి చెందిన అశ్వర్థనారాయణను ఆదివారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కనిసెట్టిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సి.శివారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకొని ఆయన ఇంటి దగ్గరకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే తిరుమలదేవరపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామన్న అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఇంటి వద్దకు వెళ్లి రామన్నను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

శుభకార్యం

ఓడీచెరువు: బాబాసాహెబ్‌పల్లికి చెందిన రవీంద్రారెడ్డి కుమార్తె మానస వివాహం పృథ్వీరెడ్డితో ఆదివారం కదిరిలో జరిగింది. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి , సీనియర్ నేత షామీర్ బాషా, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్లి రంగారెడ్డి, నల్లమాడ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, శివారెడ్డి, గంగిరెడ్డి, కుళ్లాయప్ప తదితరులు పాల్గొనన్నారు.

కొత్తచెరువు: మరకుంటపల్లిలో ఆదివారం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి కుమార్తె శ్వేత, అమడగూరుకు చెందిన భాస్కర్ రెడ్డి కుమారుడు లవన్ కుమార్ రెడ్డితో జరిగింది. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కె.లోచర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత దివంగత ఈశ్వర్‌రెడ్డి, తేజోవతి కుమారుడు రాజేష్ కుమార్‌రెడ్డి, సాయిలీల వివాహం బసంపల్లిలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

పుట్టపర్తి అర్బన్: వెంగళమ్మచెరువులో వైఎస్సార్‌సీపీ నేత, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి కుమార్తె హేమలత, మహేంద్రరెడ్డి వివాహ నిశ్చితార్థం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. పెడపల్లి పెద్దతండాలో జరిగిన పార్టీ పట్టణ కన్వీనర్ రవినాయక్ అన్న కుమార్తె లక్ష్మానాయక్ కుమార్తె సరస్వతీబాయి, ఆకాష్ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కంబాలపర్తి గ్రామానికి చెందిన శేఖర్ నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ ఈశ్వరప్ప, మాజీ కన్వీనర్ నరసారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, గంగిరెడ్డి, లాయర్ మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ధర్మవరం రూరల్: ఖరీఫ్ పంటల సాగులో నూతన పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడులను సాధించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు జాహ్నవి, చందన రైతులకు సూచించారు. ఆదివారం గొట్లూరు, చింతలపల్లిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వేరుశనగ, కంది, శనగ, బత్తాయి తదితర పంటల్లో సస్యరక్షణ, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే అందిస్తున్న సేవలు, విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా పిచికారీ తదితర అంశాలను వివరించారు. అనంతరం కోళ్లు, పొట్టేళ్ల యాజమాన్య పద్ధతులను డాక్టర్ రఘుకరన్, డాక్టర్ శేఖర్ తెలియజేశారు. భూసార పరీక్షలు, ఎరువుల వాడకం తదితర వాటిపై ఏఓ ముస్తఫా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి అమరేశ్వరి, నాయకులు మహేష్ చౌదరి, నీటి సంఘాల ప్రెసిడెంట్ కాటమయ్య, రైతు సేవా కేంద్రం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెడపల్లి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పుట్టపర్తి అర్బన్: పెడపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 2006–2007 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 18 ఏళ్ల తర్వాత అందరూ ఒకేచోట కలవడంతో వారి ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, పాధ్యాయులు ప్రసాద్, రాఘవాచార్యులు, భాస్కర్‌రెడ్డి తదితరులను గ్రామంలో ఊరేగింపుగా తీసుకొచ్చి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి

అమరాపురం: వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల కూడలిలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం ద్వారా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే మందులు, ఎరువులకు స్వస్తి పలకాలన్నారు. పంటల సాగులో వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో శాస్త్రీయ బృందం పర్యటించి రైతులకు నూతన సాంకేతికత, కేంద్ర రాష్ట్ర వ్యవసాయ పథకాలపై సమాచారం అందించడం జరుగుతుందన్నారు. నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్ తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాలు, ఎరువులు, తక్కువ మందులు వాడకం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజసదానందగౌడ, ఏఓ మంజునాథ, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటికి వేసిన తాళాల తొలగింపు


ఇంటికి తాళాలు తొలగించిన పోలీసులు

హిందూపురం: అప్పు తీర్చలేదని బాధితురాలి ఇంటికి వేసిన తాళాలను పోలీసులు తొలగించారు. అప్పలకుంటలో నివాసముంటున్న హనుమప్ప అప్పు తీసుకున్నట్లు ఎలాంటి ఆధారం లేకపోయినా, అతను మరణించి ఐదేళ్లయినా డబ్బులివ్వాంటూ అతని భార్య, కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన అంజక్క ఆమె కుమారుడు సుధాకర్ ఒత్తిడి జేస్తూ శనివారం వారిని బయటకు గెంటేసి ఇంటికి తాళాలు వేశారు. దీంతో ఇంటి బయటే బాధిత గంగమ్మ కుటుంబంతో బైఠాయించింది. ఈ విషయంగా బాధిత కుటుంబం హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ ఆంజనేయులు ప్రత్యేక చొరవ చూపి సమస్యకు పరిష్కారం చూపుతూ పోలీసులను గ్రామానికి పంపించారు. పోలీసులు గ్రామస్తుల సమక్షంలో గంగమ్మ ఇంటికి వేసిన తాళాలు తొలగించి ఆమె కుటుంబాన్ని ఇంటిలోకి చేర్చారు. మళ్లీ గొడవకు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చర్యలు తీసుకుంటామని బాధితురాలికి పోలీసులు సూచించారు.